# అమ్మమ్మతల్లి

## పూడిపెద్ది వేంకట రమణయ్య

చెంగల్వారాయుడు టీకాల రైటరు. టీకాలువేసే ఉద్యోగికి ఈ రైటరు పేరు ఎలా సార్థకమో నాకు తెలీదు. టీకాల డాక్టరంటే బాగుండునేమో! అతడు ఏజన్సీలో ఆటవికజనంలో టీకాలు వేయవలసిన అవసరం.కలిగిందప్పుడు. తెల తెలవారుతూంది. ఎవడో ఒక గదబవాని సాయంతో ఆ గదబవలసో, గదబపల్లో ఏదో పేరుగల రెండు మూడు పుంజీల ఇలువ రాలుగల గ్రామసమీపాన్న చిన్న గుడార మెత్తికొని మకాం చేసేడు. టీకాలు వేయడంపని ఎంతో సులభసాధ్యంగా కనబడుతుంది మనకి. ఏముంది? ఒక మనిషి చేయి అందుకొని వానిభుజాననో, ముంజేతనో రొటేటరీలాన్సెట్టు మందులో ముంచి గిరగిరా త్రిప్పేస్తాడు. కాని పాణి గ్రహణాని కెంత తంతు నడవాలో టీకాలు వేయడానికి పాణిగ్రహణం చేయాలంటే అంత తంతు కావాలి. టీకాలంటే అదేమిటో గాని, ప్రజలంత భయపడతారు. నాటు ప్రజ చెప్పేవద్దు. ఆటవికుల కాగోలే తెలీదు. మన భాషా? మన ఊహా? ఎంతో నచ్చచెప్పాలి వాళ్లకి. ఆ కార్యభారం చెంగల్వారాయని మీద పడ్డ దానాడు. సరే సంసిద్ధపడ్డాడు. కాంపుమంచం, ఇక్మిక్ కుక్కరు, హోల్డాలు, థెర్మోఫ్లాస్కు, మరచెంబూ తానూ మకాం చేసే డా అడవి మధ్యను.

బస సదును చేసుకొని, సాపు చేసుకొని వంట చేసుకొని, భోజనం చేసుకొని ప్రచారం ప్రారంభించడానికి సిద్ధపడ్డాడు. హోల్డాలులో ఉన్న తన ఆయుధాల పెట్టె పైకితీసేడు. మందు కొంచమే ఉంది. లేనే లేదో. క్రొత్త మందు బంగీ తపాలా కచేరీకి వచ్చేఉంటుంది. అక్కడకు తపాలా కచేరీ మూడు మైళ్ల దూరంలో ఉంది. తనకు తైనాతీ వచ్చిన 'రఘువ' అనే గదబవాని చేతికి ఒక చీటీ వ్రాసి యిచ్చి తపాలాధికారికి చూపుమని వానిని పంపి ఆ గుడారం నడుమ అమర్చుకున్న కాంపుమంచం మీద పడుకున్నాడు చెంగల్వారాయడు. మెత్తని దిండ్లలో తల పొదువుకొని ఏదో వింత సంచలనం కలిగించే ఆ వన్యప్రదేశంలో నిర్మలమైన గాలి పీలుస్తూ కొత్త పక్షుల గీతాలు వింటూ ఏమేమో ఆలోచించుకుంటూ పడుక్కున్న చెంగల్వారాయనికి నిద్రపడుతూంది, మెలకువ వస్తూంది. తిరుగా నిద్రలోకి దూకుతున్నాడు. ఇలా గెన్ని సారులు చేసేడో కడసారి అతడు కన్ను తెరచికొని చూచేసరికి గుడారమంతా చీకటి వ్యాపిస్తూంది. మబ్బువేసిందనుకొని గుడార మీవలకు వచ్చి దిక్కులు పరీక్షించేడు. పడమటి కొండచాటున పసపాడుతున్నాది సూర్యబింబం. వెలుగుపస వెనుకాడుతూంది. ఆ అటవీ ప్రదేశం, ఆ గదబపల్లె, ఆ ప్రశాంత సమయాసన్నం ఇవన్నీ వానిని దిగులుతో దిగలాగడం మొదలు పెట్టేయి. వానికి ఒంటరితనం భూతంలాగు కనిపిస్తూంది.

"రఘువా రఘువా" అని కౌఁజుపిట్టలాగు గంటసేపు వాపోయేడు పిలుపుమీద పిలుపు శబ్దపటిమ హెచ్చిస్తూ. "రాలేదు కాబోలు, మూడు మైళ్ల దూరములోనున్న తపాలా కచేరీకి వెళ్లిరావడమంటే ఇంతసే పేలా? అందులోనూ రఘువనికి గమన వేగానికి పెట్టి నది పేరు. ఆటవికులకు విశ్వాస మెంతేని ఉంటుంది. చెప్పినపని తూచాలు తప్పకుండా చేస్తారు. పట్టుదల గల కార్యసాధకులు. ఏం చెప్మా రఘువా ఇంకా రాలేదు?" ఎవరు బదులు చెప్పేవారు? నిశ కార్కొంటూంది. నిశ్శబ్దం చిక్కబడుతూంది.

పరువు పరువున గదబపల్లె లోకిపోయి చెంగల్వరాయడీ కథ ఆ పల్లె వారిలో కొందరికి వచ్చీరాని గదబ భాషతోను, తెలుగు ఇంగ్లీషు ముక్కలతోను దాన్ని సంపుటీకరణంచేసి, అభినయంతో కాస్త మెరుగుదిద్ది చెప్పేడు; వారి మనస్సులను కరగించి, ఇద్దరు గదబ యువకులను తోడు తెచ్చుకొని గుడారమున పడుక్కున్నాడు కాంపుమంచం మీద కదలకుండా. వన్యమృగాల భయం వానికి లేదు గుడార ద్వారాన కూర్చుండి కావలి కాస్తున్న గదబవాళ్లున్నారు. చలిభయమూ వానికి లేదు. గుడారం చుట్టూ నెగళ్లు వెలుగుతున్నాయి. గుడారమంతటా వెచ్చని గాలులే ప్రాకుతున్నాయి. దళమైన ఉన్ని దుప్పటి తలమున్కగా కప్పుకొని పడుకొన్నాడు చెంగల్వరాయడు. వానికి నిద్రపట్టలేదు. రఘువ దేమయినాడు? మందుపెట్టె ఏంచేసేడు? దానిలెక్క తేల్చకపోతే తాను చిక్కులలో పడిపోవలసివస్తుంది. పోస్టుమాస్టరు వానికిచ్చేడో లేదో ఏ సంగతీ అనిశీథాంధకారంలాగు వాని కగమ్యగోచరమయింది. పడుతూ లేస్తూ పదిగంటల పరిమాణం గల ఆ రేయిని పది యుగాల్లాగా గడిపేడు. బల్లున తెల్లవారగానే గదబలను గుడారమునకు కాపుపెట్టి ఒక్కని సాయాన పోస్టాఫీసుకు వెళ్లాడు చెంగల్వ రాయడు.

రఘువడు వచ్చి మందు పెట్టె తీసికొని వెళ్లినట్టు తపాలాధికారి చెప్పేడు. చెంగల్వరాయనకి చిరు చెమటలు క్రమ్మేయి. ఏం దారి? దొరతనము వారితో పని. లొసుగులు క్షమించరు. మందు పెట్టె పోయిన దంటే ఏమి శిక్ష విధిస్తారో అధికారులు?

చేతి రుమాలుతో మొగాన చెమట తుడుచుకొని విషాదంగా నిట్టూర్చి, వెతగడానికి దొరకొన్నాడు రఘువనూ, మందు పెట్టెనూ కూడా. అక్కడకు ఆరుమైళ్ల దూరములోనున్న 'బొరిగాం' అనే చిన్న పల్లె రఘువని నివాసగ్రామం. ఆ సంగతి తెలిసికొని ఆ పల్లెకు నడచి వెళ్లేడు చెంగల్వరాయడు. ఎండ ముదిరి ఒళ్లు చిటపట లాడుతూంది. చవిటి నేలవలె ఒడలు చమరిస్తూంది. రాత్రి నుండీ ఆహార మెరుగని ఆ శరీరం భారానికి వాని పిక్కలు పీకి వడవడ వడుకుతున్నాయి కాళ్లు. వేడి యూర్పులు బుసకొడుతూ, నాల్క సవరించి పెదవులు తడపికొంటూ పొడియారిన గొంతు బిగింపును సడలించుకొంటూ కాలి ఆకు చెప్పులు తొట్రువడ రెండు యామముల కా 'బొరిగాం' చేరుకున్నాడు చెంగల్వరాయడు. ఊరి సమీపానికి రాగానే డప్పుల చడి వినబడుతూంది. ఏదో సందడిలో నున్నట్టున్నారు గ్రామస్థులు. ఊరి వెలుపలనున్న ఒక చెట్టు నీడను తాను నిలచి ఆ యూరి పెత్తనదారును పిలుచుకొని రమ్మని తనకు సాయం వచ్చిన గదబ యువకుని పంపేడు గ్రామంలోకి. దూరంగా ఏదో రాతితో గోడలు తీర్చి కడుతున్నారు కొందరు గదబలు. దాని కుంద్రనా కట్టుబాటూ చూస్తే దేవతాగారంలాగు తోస్తూంది. "ఈ మూఢ నమ్మకం పోయింది కాదు వీళ్లకి. ఇంకా అమ్మవారు - బలులు ఈ విశ్వాసం నానాట ప్రబలుతూంది.

ఇలాటిచోట టీకాలసత్వం నచ్చచెప్పడం చాలా కష్టం. ఏం చెయ్యను! రోటిలో తల దూర్చి రోకటిపోటుకు భయపడనా?" అని యేమేమో ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆ గ్రామంలోని సంబరం జనసమూహంతో, కలకల ధ్వనితో, మిన్నంటే కేకలతో తన వైపే వస్తూంది. వాళ్లకు కానరాకుండా ఆ చెట్టుచాటున డాగి నిలచేడు చెంగల్వరాయడు – పరిసర జ్ఞానమే లేకుండా ఎగురుతూ, దాటుతూ ఆ క్రొత్తగా కట్టే గుడివైపు పోతూంది ఆ సంబరం. అతడా సంబరం నడుమకు నిదానించి చూచేడు. కొందరి చేతుల మీద వీరమతం బిగించి, పూలదండలతో పుక్కిట కల్లుతో ముందుకు చాచిన వాని అరచేతులలోకి ఏదో పట్టుకొని ఒక యువకుడు కూర్చున్నాడు. వానివైపు చూచి సంతోషంతో గంతులు వేస్తున్నారు ఆడూ మగా కలసి. నడుమ నడుమ బలులిస్తున్నారు. కోళ్లు, గొఱ్ఱెలూ కోసి రక్తం చిమ్ముకుంటూ పచ్చిగంధపు ముద్దలు పట్టించుకుంటున్నారు ఒడళ్ల. పానకం వలె కల్లు జాడీలతో తాగేస్తున్నారు.

గ్రామం పెత్తందారుకోసం చెంగల్వరాయడు పంపిన గదబవాడు తిరిగివచ్చి నరవాహనం మీద ఊరేగుతున్నఆ గదబ యువకుని చూపుడువ్రేలితో చూపి "రఘువ" అన్నాడు. త్రుళ్లిపడి చెంగల్వరాయడు వాని వైపు చూచేడు. "అవును. వాడే. అదిగో ముఖాన స్ఫోటకపు గుంటలు, బట్టతల, ఆపై మీది ఎఱ్ఱపంచ తానిచ్చిందే." అనుకొని సంఘమున వానికి జరుగుతూన్న ఆ గౌరవానికి కారణమేమని వాని నడిగేడు. ఆ గదబవానికి తెలుగు రాదు. గదబ భాషలోనూ సంజ్ఞలతోనూ కూడా ఆ ఉత్సవ వివరాలు తెలిపేడు. అది యొక గ్రామ దేవత ఉత్సవమని బోధపరచికొని చెంగల్వరాయడు ఊరుకున్నాడు. "ఇది అమ్మతల్లి పండుగకాదు, అమ్మమ్మతల్లి పండుగ" అన్నాడా గదబవాడు. అది క్రొత్త పేరవడంచేత వానికి బోధపడకపోయినా తెలిసినట్టు జాలిగా తలయూచేడు చెంగల్వరాయడు. ఆ కడుతూన్న గుడి ఆ దేవత కొరకే అన్నాడు గదబవాడు. 'అఁహాఁ' అన్నాడు చెంగల్వరాయడు. వాని కా మాటలు చెవిని పట్టలేదు. ఆకలి అంతరంగికంగానూ, ఎండ బాహ్యంగానూ వానిలోనూ పైనీ కూడా ప్రజ్వలిస్తున్నాయి. మందుపెట్టె ఏమయిందో వాని నడుగుదామంటే వాడేనుగుమీది సున్నమయి ఎక్కడో అంతరాళాన అందకుండా ఊరేగుతున్నాడు. తన బస అక్కడకు తొమ్మిది మైళ్ల దూరములో నున్నది. నిలువలేక పోయాడు. సొమ్మసిలి ఆ చెట్టునీడను రాయి తలగడగ పడుక్కున్నాడు చెంగల్వరాయడు. వాని వైఖరి చూచి ఆగదబవాడు వాని కాకలి, దాహం విపరీతముగా నున్నవని పోల్చి ఉడికించిన దుంపలు, వెదురుగొట్టముతో తేనే, తామరాకుదొన్నెతో నీరూ తెచ్చి వాని కిచ్చేడు. చెంగల్వరాయడు కాస్త చల్లబడి సేదదేరి, "రఘువని కలుసుకోవచ్చునా?" అని ఆ గదబవాని నడిగేడు. "వా డా గుడివద్ద ఉండవచ్చును. అందరు వెడలిపోయారు సందడి చాలించి. మన మక్కడికి పోవచ్చు" నని వాడన్నాడు. చెంగల్వరాయడు మెల్లగా వాని చేయూతను నడుస్తూ అమ్మమ్మతల్లి క్రొత్త గుడి దగ్గరకు వెళ్లేడు. అక్క డెవ్వరూ లేరు. వా రా దేవత నా గుడిలో ప్రతిష్ఠించి విందు లారగించుటకు గ్రామంలోకి పోయారు. పొద్దు పడమటి దిక్కును సమీపిస్తూంది. కోడి వెండ్రుకలూ, నెత్తుటి మరకలతో నిండిన త్రోవ సరిచూచుకొంటూ ఆ దేవాలయ సమీపానికి వెళ్లేడు. అక్కడ నొక పూలకొట్టె మీద పొదుపుగ నుంచిన అమ్మమ్మతల్లిని చూచేడు. ఆ చేరువను నెత్తుటితో వత్తి వెలుగుతూంది. ఇంకా గుడికి పైకప్పు కట్టలేదు. ఆ దేవతవైపు నిదానించి చూచి త్రుళ్లిపడ్డాడు చెంగల్వరాయడు. ఈలోగా దేవతకు సాష్టాంగపడి లేచిన

గదబ యువకుడు వాని వైఖరి చూచి వాని నమ్మమ్మతల్లి పూనిసదని భ్రమసి వాని చుట్టూ తిరుగుతూ ఏవో గదబ పాటలు మొదలు పెట్టేడు.

కొంతధైర్యం తెచ్చుకొని చెంగల్వరాయడా గదబ వానిని వారించి, ఆ పూలకొట్టె పై నున్న దేమని వాని నడిగెను. "అదియే అమ్మమ్మతల్లి - దాని జాతరే సాగిస్తున్నారిప్పుడు ఈ ఊళ్లోక్రొత్తగా. ఈ గుడి ఇంత వేగంగా ఈదేవతకోసమే కడుతున్నా"రని ఆగదబ యువకుడు బదులుచెప్పెను.

కాస్త ధైర్యం తెచ్చుకొని "నే నా గుడిలోనికి వెళ్లి ఆ దేవతను చూడవచ్చునా?" అన్నాడు.

గదబ :- ఓ. ఆ ఉగ్రం భరించగలిగితే.

పిరికిదనంగా 'ప్రయత్నించి చూస్తా' నంటూ ఆ గుడిలోనికి అమ్మమ్మతల్లి చేరువగా పోయి వంగి నిదానించి ఆదేవతను చూచి, చూచి, అదేదో చదివి తెలిసికొన్నట్టేవలకు వచ్చి "సరే రా పోదా" మన్నాడు గదబ వానిని చెంగల్వరాయడు. వారిరువురూ కలసి పోస్టు మాస్టరు దగ్గరకు వచ్చేరు.

చెంగ :- అయ్యా పోస్టుమాస్టరుగారూ, మీ రా మందు పెట్టె వానిచేతిలో పెట్టినప్పుడు వాడేమన్నాడో చెప్పగలరా?

పోస్టు :- ఇదేమిటని వాడు నన్నడిగేడు. ఇది అమ్మవారిని చంపేదేవత అన్నాను. వాడతి జాగ్రత్తగా ఆ పెట్టెను తీసికొని వెడలిపోయాడు.

ఏం చెయ్యడమో చెంగల్వరాయనికి తోచలేదు. గాని అమ్మమ్మతల్లి జాతరలు మాత్రం అక్కడ మందు పెట్టెకు సాగుతున్నాయి.

**(ఇందలి కథ కొలది సంవత్సరాల క్రిందట ఏజన్సీ ప్రాంతాలలో జరిగిందని ఒక స్నేహితుడు నాకు చెప్పగా విని, ఇది చాలా విధాలుగా వినదగిఉన్నదని ఊహించి దానిని చిన్న కథగా అల్లేను. - పూ.వెం.ర.)**

ఆంధ్రపత్రిక, ఈశ్వర సంవత్సరాది సంచిక 1937.